సాక్షి అనకాపల్లి

బుధవారం । 5 । మార్చి । 2025



ఐపీఎల్‌కు సరికొత్తగా.. 8లో

రెండు ఐపీఎల్ మ్యాచ్‌లు జరిగే విశాఖలోని వైఎ స్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంను తీర్చిదిద్దుతున్నారు. రూ.40 కోట్లతో స్టేడియం ఆధునికీకరిస్తున్నారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం పొడిగా ఉండే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 35.9 నుంచి 36.8 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 21.2 నుంచి 21.8 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహర్
	బుధ	గురు
అనకాపల్లి	6.09	4.57
నర్సీపట్నం	6.12	4.56

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ నాయకుడికి హైకోర్టులో ఊరట

నర్సీపట్నం: బీసీ కార్పొరేషన్ స్టేట్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి శ్రీనివాస రావుకు హైకోర్టులో ఊరట లభించింది. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా శ్రీనివాసరావు సోదరుడు సత్యనారాయణ భవనాన్ని కూలగొట్టారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడిని దూషించారంటూ టీడీపీ నాయకుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు పలు సెక్షన్లతో శ్రీనివాసరావుపై కేసు నమోదు చేశారు. శ్రీనివాసరావు మంగళ**వారం హైకోర్టును ఆశ్ర**యించారు. అరెస్ట్ చేయ**వద్దని, 41 నోటీసు** ఇచ్చి వివరణ తీసుకో**వాలని హైకోర్టు పోలీసు**లను ఆదేశించింది.

పూడిమడక రోడ్డు విస్తరణ సర్వే పనులు వేగవంతం

- కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం



పూడిమడక రోడ్డు విస్తరణ సర్వే పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ సర్వే పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న ప్రస్తుత రోడ్డును 100 అడుగుల మేర విస్తరించనున్న నేపథ్యంలో జరుగుతున్న ఫైనల్ సర్వే పనులను ఆమె మంగళవారం పలు శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. సర్వే పనులు వేగవంతం చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని విస్తరణకు సంబంధించి ఎటువంటి సమస్య రాకుండా చూడాలన్నారు. పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి బాధితులకు తగు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఆర్డీవో ఆయిషా, ల్యాండ్ అండ్ రికార్డ్స్ విభాగం ఏడీ గోపాలకృష్ణ, ఆర్అండ్‌బీ, వీఎంఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.

కొలంబో చేరుకున్న ఐఎన్ఎస్ కుతార్



కొలంబో చేరుకున్న భారత నావికాదళ నౌక ఐఎన్ఎస్ కుతార్

సింధియా : హిందూ మహా సముద్రంపై శ్రీలంక, భారత్‌ల సముద్ర సంబంధాలను బలోపేతం చేసే దిశగా.. తూర్పు నావికాదళానికి చెందిన ఈస్టర్న్ ఫ్లీట్ షిప్ ఐఎన్ఎస్ కుతార్ కొలంబో చేరుకున్నట్లు నేవీ వర్గాలు తెలిపాయి. దీంతో ఓడ కమాండింగ్ ఆఫీసర్ కమాండర్ నితిన్ శర్మ.. శ్రీలంక నేవీ వెస్ట్రన్ నేవల్ ఏరియా కమాండర్ రియర్ అడ్మిరల్ ఎంహెచ్‌సీజె శిల్వా నుంచి స్వాగతం అందుకున్నారు. అనంతరం ఇరుదేశాల నావికాదళాల మధ్య వృత్తిపరమైన, ఉమ్మడి కార్యాకలాపాలపై కార్యచరణను రూపొందించడంతోపాటు రెండు దేశాల మధ్య దీర్ఘకాల భాగస్వామ్యంపై చర్చించినట్లు నేవీ అధికారులు తెలిపారు.

జిల్లాలో 33 క్షయ రహిత పంచాయతీలు




సమావేశంలో మాట్లాడుతున్న క్షయ నివారణ జిల్లా అధికారి రామకృష్ణ

మాకవరపాలెం: జిల్లాలో 33 క్షయ రహిత పంచాయతీలను గుర్తించామని క్షయ నివారణ జిల్లా అధికారులు రామకృష్ణ, అయ్యప్ప తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ రహిత గ్రామాలే లక్ష్యంగా వైద్యశాఖ చర్యలు చేపట్టిందన్నారు. దీనిలో భాగంగా ప్రతి గ్రామంలో క్షయ వ్యాధి గుర్తింపు, నివారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వైద్య సిబ్బంది కూడా వ్యాధి నివారణపై ప్రజలకు వివరించాలన్నారు. జిల్లాలో 33 క్షయ రహిత పంచాయతీలను ఎంపిక చేశామన్నారు. మాకవరపాలెం మండలం బూరుగుపాలెం పీహెచ్‌సీ పరిధిలో జి.గంగవరం, మాకవరపాలెం పీహెచ్‌సీ పరిధిలో జడ్.గంగవరం, బయ్యవరం, బి.ఎస్.పేట పంచాయతీలు వీటిలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సీతారామలక్ష్మి, చరిష్మ, ఎంపీహెచ్ఈవో రమేష్, టీబీ సూపర్‌వైజర్లు మూలయ్య, చక్రవర్తి, ల్యాబ్ టెక్నీషియన్ సుదీర్ పాల్గొన్నారు.

వేతన వేతలు

వ్యవసాయ సీజన్ ముగిసింది. ఎన్ఆర్ఈజీఎస్ పనులు జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్ల ప్రారంభమయ్యాయి. ప్రతి గ్రామంలో ఉపాధి పనుల బాట పడుతున్నారు. రోజంతా మట్టిలో స్వేదం చిందిస్తే కూలీలకు రూ.250-300లకు మించి రావడంలేదు. అయినా ఏదో ఇంటి ఖర్చులు తీరతాయి అని వెళితే గత ఏడు వారాలుగా వేతనాలు చెల్లించలేదు. దీంతో ఆ డబ్బులు ఎప్పుడు ఇస్తారో అని ఉపాధి కూలీలు ఎదురు చూస్తున్నారు.

- ఎన్ఆర్ఈజీఎస్ కూలీల ఆకలి కేకలు
- ఏడు వారాలుగా అందని వేతనాలు
- అప్‌లోడ్ చేసిన పక్షం రోజుల్లో డబ్బులు జమ చేయాలని నిబంధన
- నిధులు విడుదల కాలేదంటున్న అధికారులు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

జిల్లాలో వేతన బకాయి సుమారు రూ.24 కోట్లు

ఎదురుచూస్తున్న ఉపాధి కూలీలు 2.89 లక్షలు

సాక్షి, అనకాపల్లి :

రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు వారివి.. ఏదో ఉపాధి పనులు ఆదుకుంటాయి కదా అని వస్తే ఏడు వారాలుగా పస్తులుండాల్సి వచ్చింది. వేతన బకాయిలు చెల్లించడానికి ఇంకెంత కాలం పడుతుందోనన్న బెంగ కూలీల గుండెల్లో గూడు కట్టుకుంది. జిల్లాలో 24 మండలాల పరిధిలో 2.89 లక్షల మంది ఉపాధి కూలీలకు ఉపాధి వేతనాలు సుమారుగా రూ.24 కోట్లు బకాయి చెల్లించాల్సి ఉంది. జనవరి 5వ తేదీ తరువాత నుంచి ఏడు వారాలుగా వేతన బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. ఈ డబ్బులు ఎప్పుడిస్తారో.. చెప్పలేని స్థితిలో అధికారులు ఉన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) కోసం జిల్లాను నాలుగు క్లస్టర్లుగా విభజించారు.

ఒక్కో క్లస్టర్ పరిధిలో 6 మండలాలున్నాయి. నాలుగు క్లస్టర్ల పరిధిలో ఉన్న 24 మండలాల పరిధిలో దాదాపుగా ఉపాధి పనులు ప్రారంభమయ్యాయి. రోజంతా కష్టపడితే సగటున రూ.250-288లకు మించి కూలి డబ్బు పడడం లేదు. ఆ డబ్బు కూడా ఏడు వారాలుగా బకాయి ఉంది. ఒక్కో కూలీకి సగటున రూ.8,500 నుంచి రూ.10 వేల వరకు చెల్లించాల్సి ఉందని సమాచారం. జిల్లాలో సుమారు రూ.24 కోట్లకు పైగా బకాయి ఉంది. జనవరి 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన కూలీలకు కూలి సొమ్ము వచ్చింది. డిసెంబరు ఆఖరు వారం వరకు డబ్బులు వచ్చాయి. జనవరి మొదటి వారం నుంచి ఈ రోజు వరకు అంటే ఏడు వారాలుగా ఉపాధి వేతనాలు అందక కూలీలు అవస్థలు పడుతున్నారు. జిల్లాలో కోటవురట్లలో అత్యధికంగా రూ.1.65 కోట్ల వేతన బకాయి ఉంది.

ఒక్కో రోజు లక్షకు పైగా కూలీలు..

ఎన్ఆర్ఈజీఎస్ అమలులో భాగంగా 2,81,075 జాబ్ కార్డులు జారీ చేశారు. అందులో పనులకు హాజరయ్యే యాక్టివ్ జాబ్ కార్డులు 2,02,924 వరకు ఉన్నాయి. పనులకు హాజరయ్యేవారు 2,07,896 మంది వేతనదారులున్నారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో సగటున రోజుకు లక్ష నుంచి లక్షా 20 వేలమంది వరకు హాజరయ్యారు. మార్చి నెల నుంచి కూలీలు పూర్తి స్థాయిలో పనులకు హాజరయ్యే అవకాశమున్నందున వేతన బకాయిలు చెల్లిస్తే 2 లక్షలకు పై చిలుకు వేతనదారులు పనులకు వస్తారు.

లేదంటే తగ్గే అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 1.20 కోట్ల పనిదినాలు కల్పించాలని లక్ష్యం కాగా... 1.14 కోట్ల పనిదినాలు (ఫిబ్రవరి నెలాఖరు వరకు) పూర్తిచేశారు.

రాష్ట్రవ్యాప్తంగా నిధులకు కటకట



ఈ ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 95 శాతం పనిదినాలు కల్పించాం. మార్చి నెలలో దాదాపుగా లక్ష్యానికి మరింత చేరువవుతాం. ఉపాధి వేతనదారులకు జనవరి 5 నుంచి బకాయిలు పెండింగ్ ఉన్న మాట వాస్తవమే. త్వరలో నిధులు విడుదలవుతాయి. అయితే ఈ సమస్య అనకాపల్లి జిల్లాలోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. జనవరి 5 తరువాత చేసిన ఉపాధి పనులకు కేంద్రం నుంచి నిధులు ఇంకా విడుదల అవ్వలేదు. అందుకే బకాయిలు పేరుకుపోయాయి. నిధులు మంజూరైన వెంటనే చెల్లింపులు ప్రారంభిస్తాం.

– పూర్ణిమాదేవి, డ్వామా పీడీ అనకాపల్లి జిల్లా

- ఆకులు పట్టుకొని ఉపాధి కూలీల వినూత్న నిరసన

బకాయిలైనా చెల్లించండి... తిండైనా పెట్టండి

దేవరాపల్లి: ఉపాధి హామీ వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని ఉపాధి కూలీలు వినూత్న నిరసనకు దిగారు. తామరబ్బ గ్రామంలో మంగళ వారం ఆకులు చేతపట్టుకొని నిరసన చేపట్టారు. బకాయిలైన చెల్లించండి... తిండైనా పెట్టండి అంటూ నినాదాలు చేసి వారి నిరసనను వెళ్లగక్కారు. వీరికి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మద్దతు పలికారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గత ఏడు వారాల నుంచి కూలీలకు సొమ్ము అందించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం చేసిన పనికి సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కూలీలు గ్రామాలు విడిచి వలసలు పోతున్నారన్నారు. గత మూడేళ్లుగా బడ్జెట్‌లో నిధులకు కోత విధించి, మెటీరియల్ చార్జీలు పెంచేశారని, దీంతో కాంట్రాక్టర్లకు ముందు బిల్లులు చెల్లించి, కూలీలకు పెండింగ్ పెడుతున్నారన్నారు. గతంలో 20 శాతం సమ్మర్ అలవెన్స్ ఇచ్చేవారని, ఇప్పుడు పూర్తిగా కోత విధించారన్నారు. వెంటనే ఈ ఏడాది 30 శాతం సమ్మర్ అలవెన్స్‌తో పాటు మెడికల్ కిట్లు, టెంట్లు, తట్టా, గునపం, మంచినీటికి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి 200 రోజుల పనిదినాలు, రోజూ 600 కూలీ సొమ్ముతో పాటు ట్రావెలింగ్ అలవెన్స్ ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ కూలీల సమస్యలపై ఈనెల 12న ఛలో విజయవాడ కార్యక్రమం పేరిట ఆందోళన చేపట్టనున్నామని, విజయవంతం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి. వెంకన్న కోరారు.



తామరబ్బలో పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆకులు పట్టుకొని వినూత్న నిరసనకు దిగిన ఉపాధి హామీ కూలీలు

ఎమ్మెల్సీ ఫలితం కూటమికి చెంపపెట్టు



మాట్లాడుతున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చిత్రంలో దేవన్‌రెడ్డి, రవిరెడ్డి, మొల్లి అప్పారావు

- కుటమి దుష్టపాలనకు టీచర్లు గట్టిగా బుద్ధి చెప్పారు
- శ్రీనివాసులునాయుడు గెలవడంతో ప్లేటు ఫిరాయించారు
- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనకు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితం చెంపపెట్టులాంటిదని వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఉత్తరాంధ్రపై చూపుతున్న వివక్షకు నిరసనగా టీచర్లు గట్టి షాకిచ్చారని పేర్కొన్నారు. కూటమి బలపరచిన రఘువర్మ ఘోర పరాజయం తర్వాత ఉత్తరాంధ్రకు చెందిన టీడీపీ నాయకులు మాట మార్చారని మండిపడ్డారు. గెలిచిన గాదె శ్రీనివాసులునాయుడు తమ అభ్యర్థే అంటూ మంత్రి అచ్చెన్నాయుడు చేస్తున్న ప్రకటనలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. రఘువర్మను గెలిపించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సమావేశాలు నిర్వహించారని, తన ఎక్స్ ఖాతాలో రఘువర్మకు టీడీపీ శ్రేణులు ఓటెయ్యాలని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఆయనతోపాటు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు, హోంమంత్రి వంగలపూడి అనిత, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, అశోక్ గజపతిరాజు లాంటి సీనియర్ నాయకులు బహిరంగంగానే పిలుపునిచ్చారని పేర్కొన్నారు. వీ టితో పాటు రఘువర్మను గెలిపించాలని టీడీపీ నా యకుల పేరుతో పత్రికా ప్రకటనలు కూడా వచ్చా యన్నారు. జనసేన పార్టీ సైతం తన అధికారిక ఖా తాలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా రఘువ ర్మను ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. గాదె శ్రీనివాసులు నాయుడుకి మద్దతు ఇచ్చినట్టు కూట మి నాయకులు ఒక్క ఆధారమైనా చూపించగలరా ? అని ప్రశ్నించారు. ఎవరికో పుట్టిన బిడ్డకు మీ పేరు పెట్టుకోవద్దంటూ ఎద్దేవా చేశారు. 9 నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై ఉద్యోగుల్లో వచ్చిన వ్యతిరేకతకు ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. ఉద్యోగుల్లో దాదాపు 35 శాతంగా ఉన్న టీచర్లు ఇచ్చిన తీర్పుతో ప్రభుత్వ వైఫల్యం బయటపడిందన్నారు.

అడవిలో అడ్డదారికి బ్రేక్

సాక్షి ఎఫెక్ట్..



పెదపల్లి అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన రహదారిని పొక్లెయిన్‌తో తొలగిస్తున్న సిబ్బంది

- రియల్ ఎస్టేట్ వెంచర్‌కు వేసిన రహదారిపై రాకపోకలు బంద్
- రహదారి తొలగించి, కందకాలు తవ్వించిన అటవీ అధికారులు
- ముగ్గురిపై కేసు నమోదు.. ఇకపై అటవీ భూముల్లోకి ప్రవేశించే వారిపై కఠిన చర్యలు

యలమంచిలి రూరల్: ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌కు రాకపోకల కోసం ప్రభుత్వ, అటవీ భూముల మీదుగా అనుమతులు లేకుండా వేసిన రహదారిపై రాకపోకలు జరగకుండా అటవీ, జలవనరుల శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. పెదపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం పొడవున అక్రమంగా రహదారి ఏర్పాటు చేసుకున్న విషయంపై 'అడవిలో అడ్డదారి' శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనం సంచలనం కలిగించింది. ఇంత అక్రమం జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడంపై సాక్షిలో సమగ్రంగా వచ్చిన వార్త గత రెండ్రోజులుగా అధికార, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లా అటవీ అధికారి రాజారావు ఆదేశాల మేరకు యలమంచిలి సబ్ డీఎఫ్‌వో సునీల్ ఆధ్వర్యంలో యలమంచిలి అటవీ పరిధి అధికారి జి.అనిల్‌కుమార్, అటవీ సెక్షన్ అధికారి వెంకటరమణ, సిబ్బంది సోమ, మంగళవారాల్లో అటవీ భూమి మీదుగా ఏర్పాటు చేసిన రహదారిని పరిశీలించి, రహదారిపై రాకపోకలు జరగకుండా పలుచోట్ల కందకాలు తవ్వించారు. ఇకపై అటవీ భూముల్లోకి ఎవరైనా అక్రమంగా ప్రవేశించినా, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించినా 1967 ఏపీ అటవీ చట్టం, 1972 వన్య ప్రాణుల రక్షణ చట్టం, 2002 జీవ వైవిధ్య చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని, అతిక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ప్రాసిక్యూట్ చేస్తామని అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు రియల్ ఎస్టేట్ వెంచర్ ప్రధాన గేటుకు ఎదురుగా హెచ్చరిక బోర్డు సైతం పెట్టారు. జలవనరుల శాఖ అధికారులు కూడా శేషుగెడ్డ రిజర్వాయర్ గట్టుపై ఎలాంటి రహదారి నిర్మించకూడదని, దీనిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక జారీ చేశారు.



అటవీ భూమిలో వేసిన రహదారిపై గోతులు తవ్వి పెట్టిన హెచ్చరిక బోర్డు

ఇదిలా ఉండగా అటవీ భూమిలో రహదారి వేసినందుకు ప్రాథమికంగా గుర్తించిన సమాచారం ప్రకారం ముగ్గురిపై అటవీ చట్టాల ప్రకారం కేసు నమోదు చేసినట్టు ఎఫ్ఎస్‌వో వెంకట రమణ సాక్షికి తెలిపారు. యలమంచిలి పట్టణానికి ఆనుకుని 16వ నెంబరు జాతీయ రహదారికి సమీపంలోనే రియల్ వెంచర్ ఉందని చెప్పడంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారిలో.. అటవీ భూముల్లో వేసిన రహదారిని తొలగించడంతో ఆందోళన మొదలైంది.

పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాలి

- లైంగిక వేధింపులకు దూరంగా పెంచాలి
- ఇది మనందరి బాధ్యత: డీఎంహెచ్‌వో రవికుమార్



తుమ్మపాల: లైంగిక వేధింపులకు దూరంగా పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.రవికుమార్ అన్నారు. వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో 'పిల్లలకు లైంగిక వేధింపులు–నివారణ' అనే అంశంపై మంగళవారం ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పిల్లలపై లైంగిక దాడులు జరగకుండా చూసుకోవడం మనందరి బాధ్యత అన్నారు. లైంగిక వేధింపులపై పిల్లలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని, అపరిచితులతో జాగ్రత్తగా మసలుకునేటట్లు జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జె.ప్రశాంతి మాట్లాడుతూ తల్లిదండ్రులే కాకుండా సమాజంలోని అందరూ పిల్లలపై లైంగిక దాడులు జరగకుండా చూసుకోవాలన్నారు. పిల్లలకు గుడ్ టచ్–బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర స్థాయి ట్రైనర్ ఉదయ్‌కుమార్, సైకాలజిస్ట్ బి.నాగరాజు మాట్లాడుతూ పిల్లలు లైంగిక వేధింపులు జరగకుండా ఏ విధంగా అప్రమత్తంగా ఉండాలో వివరించారు. వైద్యాధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సీడీపీవోలు, గవర్నమెంట్ మెంటల్ హెల్త్ హాస్పిటల్ సిబ్బంది, సైకియాట్రిస్ట్ డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో పడాల రవికుమార్ హెచ్చరించారు. జిల్లాలో 58 ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలు, ఆస్పత్రులు, ల్యాబ్స్ ఎటువంటి లింగ నిర్ధారణ పరీక్షలు చేపట్టినా కఠినంగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ పట్టుబడినవారిపై గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం–1994 ప్రకారం మొదటిసారి మూడేళ్ల జైలు శిక్ష, రూ.50 వేలు జరిమానా, ఐదేళ్ల వరకు ధ్రువీకరణ రద్దు చేస్తామన్నారు. రెండోసారి తప్పు జరిగితే ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించి, వైద్య ధ్రువీకరణ శాశ్వతంగా రద్దు చేస్తామన్నారు.

ఇంటర్ పరీక్షకు 96.2 శాతం హాజరు



ఇంటర్ పరీక్షలకు వెళ్తున్న విద్యార్థులు

యలమంచిలి రూరల్: జిల్లావ్యాప్తంగా 34 కేంద్రాల్లో ఇంటర్ పబ్లిక్ పరీక్ష మంగళవారం సజావుగా జరిగింది. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని డీఐఈవో బి సుజాత తెలిపారు. మంగళవారం జరిగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్–1 పరీక్షకు మొత్తం 14,249 మందికి గాను 13,709 (96.2 శాతం) మంది హాజరయ్యారని ఆమె తెలిపారు. వీరిలో జనరల్ విద్యార్థులు 11,620 మందిలో 11,297 మంది, వొకేషనల్ విద్యార్థులు 2629 మందిలో 2412 మంది హాజరయ్యారు. మొత్తంగా 540 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు హాల్ టికెట్లను తెల్ల కాగితంపై మాత్రమే ప్రింటు తీసుకొని పరీక్షలకు హాజరు కావాలని, కలర్ పేపర్లపై తీసిన ప్రింట్లను అనుమతించరని డీఐఈవో తెలిపారు.

మహిళల భాగస్వామ్యంతో గ్రామీణాభివృద్ధి



ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న జెడ్పీటీసీ అనురాధ

- జాతీయ వర్క్‌షాప్‌లో వివరించిన జెడ్పీటీసీ అనురాధ

కె.కోటపాడు: ఢిల్లీలో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో కె.కోటపాడు జెడ్పీటీసీ ఈర్లె అనురాధ మంగళవారం పాల్గొన్నారు. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాప్‌లో ఆంధ్రప్రదేశ్ తరఫున ఎంపిక చేసిన ముగ్గురు జెడ్పీటీసీలతో కలిసి ఆమె పాల్గొన్నారు. మహిళల భాగస్వామ్యంతో గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వర్క్‌షాప్‌లో వివరించినట్లు అనురాధ తెలిపారు. వర్క్‌షాప్‌లో కేంద్ర పంచాయతీరాజ్, ఫిషరీస్, పశుసంవర్ధకశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, సహాయ మంత్రి ఎస్.పి. సింగ్, కేంద్ర మహిళా, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి అన్నపూర్ణదేవి పాల్గొన్నట్లు అనురాధ తెలిపారు.

ఎన్నికల కోడ్ ఎత్తివేత

మహారాణిపేట (విశాఖ): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో ఎన్నికల కోడ్ ఎత్తి వేశారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఇక మీదట అన్ని కార్యక్రమాలు యథావిధిగా జరుగుతాయన్నారు. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గత నెల 3న ఎన్నికల నోటిఫికేషన్ జారీ నుంచి కోడ్ అమల్లోకి వచ్చింది. 27న పోలింగ్, ఈ నెల 3న ఓట్ల లెక్కింపు పూర్తయింది. పీఆర్టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు గెలుపొందిన విషయం తెలిసిందే.

క్లుప్తంగా

ఎస్‌ఐ కొలువులు సాధించిన పూర్వ విద్యార్థులకు సత్కారం



డీఎస్పీ శ్రీనివాసరావు సమక్షంలో ఎస్‌ఐ కొలువులు సాధించిన నాని, దుర్గాప్రసాద్‌లను సత్కరిస్తున్న కరస్పాండెంట్ కోనా సతీష్

నర్సీపట్నం : సబ్ ఇన్‌స్పెక్టర్లుగా కొలువులు సాధించిన పూర్వ విద్యార్థులను రిషీ కళాశాల యాజమాన్యం, డీఎస్పీ పి.శ్రీనివాసరావు సమక్షంలో ఘనంగా సత్కరించారు. రావికమతం మండలం, పి.పొన్నవోలు గ్రామానికి చెందిన పి.నాని, కె.దుర్గాప్రసాద్ రిషీ డిగ్రీ కళాశాలలో చదివారు. ఇటీవల నిర్వహించిన సబ్ ఇన్‌స్పెక్టర్ల పోటీ పరీక్షల్లో ఎస్‌ఐ కొలువులు సాధించి, ప్రస్తుతం ట్రైనీ ఎస్‌ఐలుగా బాధ్యతలు స్వీకరించారు. వీరిని కళాశాలకు ఆహ్వానించి డీఎస్పీ సమక్షంలో కరస్పాండెంట్ కోనా సతీష్, అధ్యాపకులు సత్కరించారు. అనంతరం ట్రైనీ ఎస్‌ఐలు పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

కుళ్లిన కోడిగుడ్ల సరఫరాపై గర్భిణుల ఆందోళన



యాదగిరిపాలెంలో కుళ్లిన కోడిగుడ్లు

మునగపాక : యాదగిరిపాలెం అంగన్‌వాడీ కేంద్రం నుంచి గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేస్తున్న కోడిగుడ్లు నిల్వ ఉండిపోవడంతో కుళ్లిన వాసన వస్తుందని పలువురు ఆందోళనకు గురయ్యారు. పలువురు గర్భిణులు స్థానికంగా ఉండే అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న కోడిగుడ్లు, పాలు తీసుకువెళతారు. సుమారు 10 రోజుల క్రితం సరఫరా చేసిన గుడ్లను ఉడికించేందుకు గర్భిణి యత్నించగా కుళ్లిన వాసన రావడంతో ఆందోళనకు గురయ్యారు. కోడిగుడ్లు నిల్వ ఉన్నవిగా గుర్తించి సంబంధిత అంగన్‌వాడీ టీచర్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో పెద్దలు కొంతమంది కలుగజేసుకొని నిల్వ ఉన్న గుడ్లను పంపిణీ చేయకుండా చూసుకోవాలని ఇకపై ఇలాంటి తప్పులు జరిగితే సహించేది లేదని పలువురు హెచ్చరించారు.

ఐపీఎల్‌కు సరికొత్తగా..

- ముస్తాబవుతున్న వైఎస్సార్ క్రికెట్ స్టేడియం
- మ్యాచ్‌ల నిర్వహణపై ఏసీఏ, జిల్లా యంత్రాంగం సమీక్ష



స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహక కమిటీ బృందం

విశాఖ స్పోర్ట్స్: ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఆడే తొలి రెండు మ్యాచ్‌లకు విశాఖలోని వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం సరికొత్త రూపు సంతరించుకుంటోంది. ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణకు సంబంధించి మంగళవారం జిల్లా యంత్రాంగం సమావేశమైంది. ముందుగా ఆంధ్ర క్రికెట్ సంఘం అపెక్స్ కౌన్సిల్‌తో పాటు కలెక్టర్ హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, మ్యాచ్ నిర్వాహక కమిటీ స్టేడియంను పరిశీలించింది. మ్యాచ్‌లు సజావుగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించింది. స్టేడియంలో ఆధునికీకరణ పనులు పర్యవేక్షించిన అనంతరం.. ఫ్లడ్‌లైట్ల పనితీరును పరిశీలించింది. ప్రేక్షకులకు ఇబ్బంది కలగకుండా స్టేడియం, స్టేడియం బయట ఎలాంటి ఏర్పాట్లు చేయాలి? ప్రవేశ మార్గాలు ఏర్పాటు తదితర అంశాలపై కమిటీ చర్చించింది. ఈ సందర్భంగా కలెక్టర్, సీపీ కాసేపు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశారు. కాగా.. ఈ నెల 24న రాత్రి ఏడు గంటలకు ఢిల్లీ క్యాపిటల్స్‌తో లక్నో సూపర్‌జెయింట్, 30న ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు డీసీతో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి. ఈ రెండు మ్యాచ్‌లకు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో టికెట్లు విక్రయించనున్నారు.

రూ.40 కోట్లతో స్టేడియం ఆధునికీకరణ

సాంకేతికతను అనుసంధానిస్తూ విశాఖలోని వైఎస్సార్ స్టేడియంను ఆధునికీకరిస్తున్నట్లు ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ తెలిపారు. సీపీ, ఏసీఏ కార్యదర్శి సానా సతీష్‌బాబుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఢిల్లీ క్యాపిటల్స్ సూచనల మేరకు స్టేడియంలో బాత్‌రూమ్‌లను పెంచి అభిమానులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. సంక్రాంతి అనంతరం ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టి.. స్టేడియం స్వరూపమే మార్చినట్లు చెప్పారు. దాదాపు 40 కోట్ల వరకు వెచ్చించి, తొలి దశ పనులు పూర్తి చేశామన్నారు. ఫ్లడ్‌లైట్ల కోసం రూ.9.5 కోట్లు వెచ్చించినట్లు పేర్కొన్నారు. 34 వీఐపీ కార్పొరేట్ బాక్స్‌లతో పాటు రెండు టీమ్ బాక్స్‌లను సరికొత్తగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. దీంతో బీసీసీఐ సైతం ఈ ఏడాది మరిన్ని మ్యాచ్‌లను విశాఖ వేదికగా నిర్వహించేందుకు మాటిచ్చిందన్నారు. విశాఖలో మరో ఇంటిగ్రేటెడ్ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి ఎటువంటి ఆలోచన లేదని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి సానా సతీష్‌బాబు ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. ప్రతి జిల్లాలో క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటుతో పాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు వివరించారు. సీపీ మాట్లాడుతూ మరోసారి విశాఖ వేదికగా ఐపీఎల్ జరగడం శుభపరిణామన్నారు. ఆటగాళ్ల నుంచి అభిమానుల భద్రత వరకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాట్లు చేస్తామన్నారు.

పక్కాగా పదో తరగతి పరీక్షలు

- విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకుడు విజయభాస్కర్



మాట్లాడుతున్న విద్యాశాఖ ఆర్జేడీ విజయభాస్కర్

అనకాపల్లి: ఈ నెల 17 నుంచి జరుగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ఎటువంటి అక్రమాలు, ఆరోపణలకు తావు లేకుండా నిబంధనల ప్రకారం పక్కాగా నిర్వహించాలని విద్యాశాఖ విశాఖ ప్రాంతీయ సంచాలకుడు (ఆర్జేడీ) బి.విజయభాస్కర్ పేర్కొన్నారు. అనకాపల్లి గుండాల కూడలిలో ఉన్న జీవీఎంసీ ఎస్సార్ శంకరన్ సమావేశ మందిరంలో మంగళవారం టెన్త్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. సెల్‌ఫోన్లు, వాచ్‌లు, తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరాదని, అధికారులు, సిబ్బంది వద్ద కూడా ఫోన్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు, పరీక్షల విభాగం సహాయ కమిషనర్ శ్రీధర్‌రెడ్డి, డీసీఈబీ కార్యదర్శి సిహెచ్ సత్యనారాయణ (కిట్టు), కార్యాలయ పర్యవేక్షకుడె రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

రాంబిల్లి (యలమంచిలి) : మైనర్ బాలికపై అత్యాచారం ఘటనపై రాంబిల్లి పోలీస్‌స్టేషన్ లోనెల 2వ తేదీన నమోదైన పోక్సో కేసులో నిందితుడు లాలం రామదాసును అరెస్టు చేశారు. పరవాడ డీఎస్పీ విశ్వస్వరూప్ ఆధ్వర్యంలో నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు రాంబిల్లి సీఐ సి.హెచ్ నరసింగరావు తెలిపారు.

ఎన్టీపీసీ ఈడీగా సమీర్‌శర్మ



పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)గా సంస్థ జీజీఎం సమీర్‌శర్మ నియమితులయ్యారు. సమీర్‌శర్మ తన విస్తృత అనుభవంతో సంస్థలో కార్యాచరణ నైపుణ్యం, వ్యూహాత్మక వృద్ధిని సాధించడంలో కీలక పాత్ర పోషించినందున ఈ గౌరవం దక్కింది. మున్ముందు సింహాద్రి ఎన్టీపీసీ పురోభివృద్ధికి ఆయన నియామకం మరింతగా దోహదపడుతుందని సంస్థ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది.

శివాలయం ప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభం



శివాలయం ప్రతిష్ట సందర్భంగా హోమాది కార్యక్రమాలు

చీడికాడ : అప్పలరాజుపురం శ్రీ లలితాదేవి ఆలయం సమీపంలో(దసరా మెట్ట) మీద నూతనంగా నిర్మిస్తున్న అన్నపూరణ విఘ్నేశ్వర స్వామి శివాలయం ప్రతిష్ట కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఈ ప్రతిష్టా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ చుక్కా అప్పల నాయుడు తెలిపారు. మంగళవారం సర్పంచ్, 13 మంది దంపతులతో కలిసి హోమాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బుధవారం పూజాది కార్యక్రమాలు, గురువారం అన్న సమారాధన ఉంటాయని తెలిపారు.

సాల్వియాన్ కార్మికుల సమస్యలపై వినతి



సమస్యలపై మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం రూరల్ : సాల్వియాన్ పరిశ్రమ కార్మికుల వేతనాల సమస్యలపై లేబర్ కమిషనర్‌కి సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రొంగలి రాము మాట్లాడుతూ సాల్వియాన్ పరిశ్రమ కార్మికులకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా అర్ధంతరంగా మూసివేయడం అన్యాయమన్నారు. మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించి, పరిశ్రమ తెరిపించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం, లేబర్ అధికారులు వెంటనే స్పందించి కార్మికులకు ఇవ్వవలసిన బకాయి వేతనాలు ఇస్తూ పరిశ్రమ తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అర్ధంతరంగా పరిశ్రమ బంద్ చేసిన సాల్వియాన్ పరిశ్రమ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయు నాయకులు డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

చీడికాడ : మండలంలో అప్పలరాజుపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో 1990–91 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు మంగళవారం తమ చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. 35 సంవత్సరాలు తర్వాత తొలిసారిగా కలుసుకుని, పాత జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు. ఈ సందర్భంగా నాడు పాఠశాలల్లో చదివిన రోజులను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు ఆర్థిక సహకారంతో పాఠశాలకు కంప్యూటర్‌ను అందజేశారు. పాఠశాల ఆవరణలో 30 మొక్కలు నాటారు. పాఠశాలల్లో చదువుతున్న 250 మంది విద్యార్థినీ, విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. అప్పట్లో చదువు నేర్పిన ఉపాధ్యాయులు వెంకట్రావు, పాల్ మాస్టర్, నర్సిరెడ్డి, రికార్డు అసిస్టెంటు గిరిజ, అప్పటి అటెండర్ లక్ష్మి తదితరులను సత్కరించారు. ప్రస్తుత పాఠశాల హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థిని, ఎంపీపీ కురచా జయమ్మ, పెంటకోట రమణబాబు, పుట్టా రవి తదితరులు పాల్గొన్నారు.

కందిపప్పు అడగొద్దు

- ఈ నెలలో కూడా ఎగనామం పెట్టిన కూటమి ప్రభుత్వం
- అసహనం వ్యక్తం చేస్తున్న కార్డుదారులు



మహారాణిపేట: కూటమి ప్రభుత్వంలో ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్) అస్తవ్యస్థంగా మారింది. ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం కార్డుదారులకు అందించే కందిపప్పునకు ఈ నెల కూడా ఎగనామం పెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పీడీఎస్ ద్వారా పంపిణీ చేసే నిత్యావసర సరకుల సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. కేవలం బియ్యం, పంచదార మినహా మిగిలిన సరుకుల సరఫరా నోచుకోవడం లేదు. కందిపప్పు సరఫరా కూడా రెండు నెలల ముచ్చటగానే ముగిసింది. ఆ తర్వాత నుంచి కందిపప్పు జాడలేదు. ఈ నెల కూడా కంది పప్పును మాత్రం అడగొద్దని అంటున్నారు. కొన్ని నెలలుగా కందిపప్పు పంపిణీ నిలిచిపోగా మార్చి నెలలోనైనా ఇస్తారని కార్డుదారులు ఆశగా ఎదురు చూశారు. కానీ ఈ నెలలో కూడా పంపిణీ చేయలేమని కూటమి ప్రభుత్వం చేతులెత్తేయడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఎన్నికలకు ముందు కూటమి పార్టీల నాయకులు బియ్యం కార్డుదారులకు వరాల జల్లు కురిపించారు. రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు, నూనె, గోధుమ పిండి, రాగి పిండి తదితర సరుకులు అందజేస్తామని హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత దానిపై కనీసం దృష్టి సారించలేదు.

చుక్కలు చూపిస్తున్న కందిపప్పు ధర

జిల్లాలో 5,12,619 తెలుపు కార్డుదారులు ఉన్నాయి. వీరి కోసం 625 చౌకధరల డిపోలు ఉన్నాయి. దీని ప్రకారం జిల్లాలోని కార్డుదారుల అవసరాలకు అనుగుణంగా 700 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం. అయితే గతేడాదిలో రెండు నెలలు మాత్రమే కందిపప్పులు సరఫరా చేశారు. గతంలో ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులకు కందిపప్పును రూ.67కు అందించేవారు. కొంత కాలంగా ప్రభుత్వం పంపిణీ చేయకపోవడం, బహిరంగ మార్కెట్లో కేజీ ధర రూ.160 వరకు పలుకుతుండటంతో పేద, మధ్యతరగతి ప్రజలు కందిపప్పు కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో పప్పన్నానికి దూరం అవుతున్నారు. వచ్చే నెలలో అయినా కందిపప్పు అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఉచిత శిక్షణ



తుమ్మపాల : ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆర్‌ఏఎంపీ పథకం ద్వారా ఉచిత శిక్షణ నిర్వహిస్తామని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు జి. నాగరాజారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువతీ యువకులకు పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చెందుటకు ఆర్‌ఏఎంపీ పథకం ద్వారా వ్యవస్థాపకత, నైపుణ్య అభివృద్ధిపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎంఎస్‌ఎంఈ (సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలు) ఎపి.ఎంఎస్‌ఎంఇ. అభివృద్ధి సంస్థ ద్వారా గుర్తింపు పొందిన శిక్షణ సంస్థ ట్రెండ్జ్ ఐటీ వారితో శిక్షణ అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎంటర్‌ప్రెన్యూర్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా నెల రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకుకోవాలన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ పొంది, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు స్థాపించుటకు అవసరమైన అవగాహన, ప్రాజెక్ట్ ప్రిపరేషన్, పథకాల వివరాలు, మార్కెట్‌పై అవగాహన కలిగి, తద్వారా ఉపాధి పొందవచ్చునని తెలిపారు.

ఈ శిక్షణ తరగతులు అనకాపల్లి పట్టణంలో ట్రెండ్జ్ ఐటీ, 12–46 మాక్స్ షాపింగ్ మాల్ పైన, 3వ ఫ్లోర్, ఉషాప్రైమ్ పక్కన, కాంప్లెక్స్ దగ్గర, 2. చోడవరం ట్రెండ్జ్ ఐటి, 5–20, లక్ష్మీపురం రోడ్, వేంకటేశ్వరస్వామి గుడి ఎదురుగా గల కేంద్రాలలో ఈ నెల 8 నుంచి నిర్వహించబడునని తెలిపారు. అనకాపలి 9502166626, 9948519782, చోడవరం 7386084548, 7799883952 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. ఉచిత శిక్షణకు హాజరు కాదలచిన అభ్యర్థులు 18 నుండి 58 సంవత్సరాలు వయస్సు కలిగి, ఆధార్ కార్డ్, పాస్ పోర్ట్ సైజు ఫోటోలు, కులధ్రువీకరణ పత్రం, తెల్లరేషన్ కార్డుతో ఈ నెల 5 నుండి సంప్రదించాలన్నారు.

వాహనమిత్ర ఎగ్గొట్టి భారీ జరిమానాలా?

- వడ్డాదిలో ఆటో కార్మికుల ఆందోళన



వడ్డాదిలో ఆందోళనలో పాల్గొన్న ఆటో కార్మికులు

బుచ్చెయ్యపేట : కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి వాహనమిత్ర నగదు అందించకుండా భారీ జరిమానాలు విధించడం వాహనదారులను మోసగించడమేనని ఆటో డ్రైవర్స్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్షణ ఆగ్రహం చెందారు. మంగళవారం మేజర్ పంచాయతీ వడ్డాదిలో ఆటో యూనియన్ నాయకులతో కలిసి ప్రభుత్వం కొత్తగా తీసికొచ్చిన నూతన మోటార్ యాక్ట్ చట్టం106(1)(2)ను వెంటనే రద్దు చేయాలని నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆటో వాహన డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కూటమి ప్రభుత్వం సంపద సృష్టి అని చెప్పి వాహనదారులపై అదనపు భారం వేయడం తగదని అన్నారు. కొత్త మోటార్ యాక్ట్‌ను రద్దు చేసి ప్రతి వాహనమిత్రకు రూ.15 వేలు అందించాలన్నారు. కార్యక్రమంలో శేఖర్, నూకరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి ఉత్తరాంధ్ర స్థాయిలో మెగా పాల పోటీలు



పశువైద్యాధికారులతో సమావేశమైన డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నరసింహులు

నర్సీపట్నం : ఉత్తరాంధ్ర పాడి పశువుల మెగా పాల పోటీలను విజయవంతం చేయాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్.నరసింహులు వైద్యులకు సూచించారు. నర్సీపట్నం ప్రాంతీయ పశువైద్యశాలలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు, పశువైద్యాధికారులు, సిబ్బందితో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక పాల దిగుబడినిచ్చే మేలు జాతి పశువుల పెంపకంపై ఆసక్తి పెంచడానికి శాస్త్రీయ పోషణ, యాజమాన్య పద్ధతుల ద్వారా రైతుల్లో పోటీతత్వం పెంపొందించడానికి ప్రభుత్వం ఈ నెల 14, 15, 16 తేదీల్లో ఉత్తరాంధ్ర స్థాయి మెగా పాల పోటీలను విజయనగరం జిల్లా తోటపాలెంలో నిర్వహిస్తుందన్నారు. ముర్రాజాతి గేదెలు, స్వదేశీ ఆవులు, విదేశీ సంకరజాతి ఆవులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.25 వేలుగా నిర్ణయించారన్నారు. అక్కడ వాతావరణ పరిస్థితులకు అలవాటు పడడానికి రెండు రోజుల ముందు 12వ తేదీ నుంచి పశువులను అక్కడికి అనుమతిస్తారన్నారు. రెండు రోజుల పాటు నిపుణులతో పశుపోషణలో మెలకువలు, ముఖాముఖీ సదస్సులు నిర్వహిస్తామన్నారు. స్టీల్ క్యాన్, ప్లాస్టిక్ తొట్టి, పశువులకు అవసరమైన ఇతర సామాగ్రి, ఆరు రోజులకు సరిపడా మేత, నీరు, దాణా, సర్టిఫికేట్, మెమెంటోతో పాటు ఒక్కో పశువుతో వచ్చే ఇద్దరు మనుషులకు ఉచితంగా రవాణా, వసతి, భోజనం సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ఆసక్తి గల రైతులు సమీపంలోని రైతు సేవ కేంద్రం వద్ద వివరాలు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు.

ఈ పంచాయతీ ఈవో మాకొద్దు...



ఈవో ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

రావికమతం : కొత్తకోట మేజర్ పంచాయతీ ఈవో జ్యోతిరెడ్డి పంచాయతీ పాలనను గాలికి వదిలి అధికారి పార్టీ నాయకులు చెప్పినట్లు చేస్తున్నారని సర్పంచ్ లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ, ఎంపీటీసీ సభ్యులు పూడి దేవ, పైల చిన్నమ్మలు, వార్డు మెంబర్లు ఆరోపించారు. మంగళవారం పంచాయతీ వద్ద విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ పాలనా పరమైన సమస్యలపై ఈవో జ్యోతి నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారన్నారు. గ్రామానికి ఆదాయం సమకుర్చేందుకు సుమారు రూ.18 లక్షల నాబార్డు, పంచాయతీ నిధులతో మార్కెట్ యార్డ్‌ను నిర్మించినా మార్కెట్ ఏర్పాటు చేయడానికి అనుమతులు ఇవ్వలేదన్నారు. దేవాలయం వద్ద మాంసం, చేపలు విక్రయాలు చేస్తున్నారని పలువురు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. తక్షణమే ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆమెపై జిల్లా కలెక్టర్, మండల అభివృద్ధికి ఫిర్యాదు చేస్తామన్నారు.


ఆర్‌ఏఆర్‌ఎస్‌లో చెరకు విత్తనం సిద్ధం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఏడీఆర్ జగన్నాథరావు

అనకాపల్లి: స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో 2009ఎ 107, 2009ఎ 252, 2012 ఎ 319, 93 ఎ 145 రకాల చెరకు విత్తనం అందుబాటులో ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్‌చార్జి ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. కావలసిన రైతులు అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ వారిని సంప్రదించాలన్నారు. స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. పిలక దశలో రబీ వరిపైరులో ఎకరాకు 35 కిలోల యూరియా వేసుకోవాలన్నారు. వరి నాటిన 30 రోజుల్లో ఫినోక్సప్రాప్ ఈథైల్ అనే కలుపు మందును ఎకరానికి 250 మి.లీ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. వాతావరణ పరిస్థితుల్లో వరిలో జింకు లోపం కనిపించే అవకాశం ఉందన్నారు. లోప సవరణకు 2 గ్రాముల జింకు సల్ఫేట్ 5 గ్రాముల యూరియాను ఒక లీటరు నీటితో కలిపి ఐదు రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారీ చేయాలన్నారు. పొడి వాతావరణం ఉండడం వల్ల అపరాలు బెట్ట పరిస్థితులకు గురయినట్లతే తేలికపాటి తడి ఇవ్వాలని సూచించారు. నువ్వు పంట వేసిన 30 రోజులకు తేలికపాటి తడి ఇవ్వాలన్నారు. ఎకరాకు 20 కిలోల యూరియాను పైపాటుగా వేసుకోవాలన్నారు. చెరకు కార్శి తోటకు మోళ్లు చెక్కిన పిదప ఎకరాకు వంద కిలోల యూరియా, 250 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 80 కిలోమ్యూరేట్ ఆఫ్ పొటాష్ దుబ్బులకు దగ్గరగా గోతులు తీసి ఎరువు వేసి మట్టితో కప్పిన తర్వాత తేలికపాటి తడిని ఇవ్వాలన్నారు. చెరకు కార్శి చేసిన వెంటనే ప్రోపికొనజోల్ 1 మి.లీ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. చెరకు మొక్కతోటలు నాటే ముందు ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3జి 13 కిలోలు లేదా ఫిప్రొని 0.3జి 10 కిలోలు క్లోరాంట్రినిలిప్రొల్ 0.4జి 9 కిలోలు చొప్పున చాళ్లలో 1.2 నిష్పత్తిలో ఇసుకతో కలిపి వేసినట్లయితే పీక పురుగు ఉధృతిని తగ్గించవచ్చని సూచించారు. మామిడి తేనే మంచు పురుగు ఆశిస్తే ఇమిడక్లోప్రిడ్ 0.4 మి.లీ బుప్రోఫెజిన్ 1.6 మి.లీ కర్బెండిజం 1 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పూత మొదలయ్యే సమయం పిందెలు తయారయ్యే సమయంలో పూత ఆకులపైనే కాకుండా మొదళ్లపైన కొమ్మల పైనా పిచికారీ చేయాలన్నారు. సమావేశంలో డాక్టర్ కె.వి. రమణమూర్తి, డాక్టర్ వి. గౌరీ, డాక్టర్ బి. భవాని, డాక్టర్ చంద్రశేఖర్, పి.వి. పద్మావతి పాల్గొన్నారు.

హోలీకి ప్రత్యేక రైళ్లు



తాటిచెట్లపాలెం: హోలీ పండగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

- చర్లపల్లి–షాలిమర్(07703) హోలీ స్పెషల్ చర్లపల్లిలో ఈ నెల 9, 16వ తేదీల్లో (ఆదివారం) రాత్రి 7.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9 గంటలకు దువ్వాడకు చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.02 గంటలకు బయల్దేరి మరుసటిరోజు (మంగళవారం) తెల్లవారు 2 గంటలకు షాలిమర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో షాలిమర్–చర్లపల్లి(07704) హోలీ స్పెషల్ ఈ నెల 11, 18వ తేదీల్లో (మంగళవారంలో) ఉదయం 5 గంటలకు షాలిమర్‌లో బయల్దేరి అదేరోజు రాత్రి 7.50 గంటలకు దువ్వాడకు చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.52 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.10 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.
- చర్లపల్లి –సంత్రాగచ్చి(07705) హోలీ స్పెషల్ ఈ నెల 7, 21వ తేదీల్లో(శుక్రవారం) ఉదయం 7.15 గంటలకు చర్లపల్లిలో బయల్దేరి అదేరోజు రాత్రి 7.45గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.47 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 10.30 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సంత్రాగచ్చి–చర్లపల్లి(07706) హోలీ స్పెషల్ సంత్రాగచ్చిలో ఈ నెల 8, 22వ తేదీల్లో (శనివారం) మధ్యాహ్నం 12.35 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 3.50 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 3.52 గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 4.40 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.

క్లుప్తంగా

చట్టాలపై మహిళలకు అవగాహన తప్పనిసరి



విద్యార్థులతో సీఐ అల్లు స్వామినాయుడు

కశింకోట: మహిళల భద్రత, రక్షణ కోసం కల్పిస్తున్న చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సీఐ అల్లు స్వామినాయుడు కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక సెయింట్ జాన్స్ స్కూలులో బాలికలకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. బాలికలు ఉత్సాహంగా హాజరై మహిళల హక్కులు, సాధికారత, సమానత్వం వంటి విభిన్న అంశాలపై తమ అభిప్రాయాలను వెలుబుచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళల భద్రత, హక్కులు, సమాజంలో వారికున్న స్థానం గురించి పోలీసు శాఖ తరపున అవగాహన కల్పించడం తమ ప్రధాన లక్ష్యమన్నారు. దీనిలో భాగంగా వక్తృత్వ పోటీలను బాలికలు నిర్వహించి భావ ప్రకటన సామర్థ్యాన్ని పెంపొందించడంతోపాటు మహిళల సాధికారత పెంచే దిశగా అవగాహన కలిగిస్తున్నామన్నారు. వక్తృత్వ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఐలు కె.లక్ష్మణరావు, మనోజ్‌కుమార్, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

మేజర్ పంచాయతీల్లో నేరాల కట్టడికి సీసీ కెమెరాలు

పట్టణ సీఐ విజయకుమార్



డీపీవో శిరీషారాణికి వినతిపత్రం అందజేస్తున్న పట్టణ సీఐ విజయకుమార్

అనకాపల్లి: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా సీసీ కెమెరాలు సకాలంలో నిందితులను పట్టుకోవడంలో ఎంతగానో ఉపయోగపడుతున్నాయని పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ అన్నారు. స్థానిక పంచాయతీరాజ్ శాఖ కార్యాలయంలో డీపీవో ఆర్.శిరీషారాణిని పట్టణ సీఐ టి.వి.విజయకుమార్, ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనకాపల్లి మండలంలో మేజర్ పంచాయతీలు తుమ్మపాల, కొత్తూరు, సత్యనారాయణపురంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు సహకరించాలని వినతిపత్రం అందజేశారు. సీఐ మాట్లాడుతూ మూడు మేజర్ పంచాయతీల్లో ఏర్పాటు చేసేందుకు 150 సీసీ కెమెరాలు కావాలన్నారు. వీటిని ఏర్పాటు చేయడం వల్ల ఆయా గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు, చోరీలు, గ్రామదేవతల ఉత్సవాల్లో సమస్యలను పరిష్కరించేందుకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి పంచాయతీ నిధులు నుంచి కెమెరాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా డీపీవో తెలిపారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 6,885 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,550	4,500
మొదటి రకం	3,530	4,140
రెండో రకం	3,080	3,670
మూడోరకం	2,690	3,070

అనకాపల్లి సినిమాలు

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్	రాజా
జాబిలమ్మ నీకు అంత కోపమా	సత్యనారాయణ స్క్రీన్-1(ఉదయం,మ్యాటీ)
పుష్ప-2	సత్యనారాయణ స్క్రీన్-1 (1,2 షోలు)
అగాథియా	సత్యనారాయణ స్క్రీన్-2
మజాకా	పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	షిర్డీసాయి
గార్డ్	వెంకటేశ్వర(ఉదయం)
తండేల్	శ్రీసత్య
శబ్దం	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 27 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-4 యూనిట్లు, ఓ పాజిటివ్-18 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 393 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

వుడా ప్లాట్లు.. రైతుల పాట్లు

- గతంలో ల్యాండ్ పూలింగ్‌కు భూములిచ్చిన రైతులు
- వారికి వుడా లేఅవుట్లలో ప్లాట్లు ఇవ్వని కూటమి ప్రభుత్వం
- స్థలాలు చూపించకుండా ఎల్‌పీఎంలు ఇచ్చిన వైనం
- రిజిస్ట్రేషన్లతో ప్లాట్‌లు ఇవ్వాలని 3 గ్రామాల రైతుల నిరసన

తుమ్మపాల: ప్రభుత్వం మారడమే మూడు గ్రామాల రైతుల పాలిట శాపమైంది. వారికి జీవనాధారమైన జీడిమామిడి తోటలతో సాగు భూములను వదులుకున్న పాపానికి ఇప్పుడు వుడా లేఅవుట్లలో ప్లాట్లు ఇవ్వకుండా కూటమి పాలకులు ముప్పుతిప్పలు పెడుతున్నారు. డీ పట్టా భూమిలిచ్చిన తమకు ఎకరానికి 18 సెంట్ల స్థలాన్ని వుడా లేఅవుట్లలో ప్లాట్‌లుగా ఇస్తారని మురిసిపోయారు. గత ప్రభుత్వం అన్ని రకాల మౌలిక సౌకర్యాలతో వుడా లేఅవుట్లను పూర్తి చేస్తున్న క్రమంలోనే ఎన్నికలు సమీపించి కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో రైతుల భూములకిచ్చే ప్లాట్‌లను కూటమి నాయకులు ఎత్తుకెళ్లే ప్రయత్నాలు ప్రారంభించారు. ల్యాండ్ పూలింగ్ ప్లాట్‌లకు రిజిస్ట్రేషన్లు నిలిపివేసి రైతులకు స్థలాలు కేటాయించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. తమ భూముల్లో ఏర్పడిన కాలనీల పనులను నిలిపివేసి నిరసనలు చేస్తే పోలీస్ కేసులు పెట్టి అరెస్టులు చేస్తామంటూ భయభ్రాంతులకు గురిచేయడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

భూములిచ్చి బాధితులుగా మిగిలిన మూడు గ్రామాల రైతులు

వైఎస్సార్‌సీపీ హయాంలో మండలంలో చేపట్టిన ల్యాండ్ పూలింగ్‌కు అనేక గ్రామాల్లో భూమిలిచ్చిన రైతులకు అప్పటి ప్రభుత్వం ప్లాట్‌లు మంజూరు చేసి రిజిస్ట్రేషన్లు కూడా పూర్తి చేసింది. పాపయ్యపాలెం, పాపయ్యసంతపాలెం, కొండుపాలెం గ్రామస్తులకు మాత్రం మంజూరు కాలేదు. ఆ తర్వాత ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఇప్పుడు ఆయా గ్రామాల రైతులు బాధితులుగా మిగిలిపోయారు. (డీ-పట్టా) సర్వే నంబరు 172, 173, 174, 175, 176, 177, 178, 179 భూములను ఏళ్ల తరబడి జీడి, మామిడి తోటలతో సాగు చేసుకుంటున్న 66 ఎకరాల మేర ప్రభుత్వానికి ఇచ్చారు. బదులుగా కోడూరు గ్రామంలో కేటాయించిన స్థలాలను మంజూరు చేయడంలో అధికారులు తీవ్ర ఇబ్బందులు సృష్టిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇప్పుడు మాత్రం పొంతన లేని కారణాలతో కాలయాపన చేస్తున్నారని, అనేక అర్జీలు చేసుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. రేపోమాపో ప్లాట్‌లు ఇస్తామంటూ ఎనిమిది నెలలుగా చేస్తున్న వాగ్దానాలను దాటవేయడం దారుణమన్నారు. తక్షణమే తమకు న్యాయం చేయాలంటూ నిరసనలు చేస్తున్నారు. తమ సమస్యపై అధికారులు, పాలకులు దృష్టి సారించాలని కోరుతున్నారు.



పాపయ్యపాలెం జగనన్న కాలనీలో నిరసన చేస్తున్న రైతులు

భూములు కోల్పోయిన రైతుల వివరాలు...

పాపయ్యపాలెం, పాపయ్యసంతపాలెం, కొండుపాలెం గ్రామాలు

రైతు పేరు	(ఎకరాల్లో) విస్తీర్ణం
1.తలారి మంగనాయుడు	1.24
2.బాడిదిబోయిన దేముడు	2.55
3.తలారి మంగనాయుడు	2.0
4.మట్టా నూకరత్నం	1.06
5.బాడిదబోయిన రామలక్ష్మి	2.56
6.అద్దెపల్లి అప్పలనాయుడు	1.55
7.అద్దెపల్లి పైడిరాజు	2.0
8.తలారి తాతారావు	3.0
9.దాకారపు రామారావు	4.85
10.పెన్నింటి కోటేశ్వరరావు	4.85
11.చందక లక్ష్మి	4.50
12.ఉరిటి అప్పారావు	4.68
13.దుల్ల ఈశ్వరరావు	0.80
14.అండిబోయిన వెంకటలక్ష్మి	0.60
15.మొల్లి అచ్చిబాబు	3.60
16.మొల్లి అప్పారావు	4.70

నిర్మాణాలు అడ్డుకుంటాం



పూర్వకాలంగా సాగు చేసుకుంటున్న జీడిమామిడి తోటను ల్యాండ్‌పూలింగ్ నిమిత్తం ప్రభుత్వానికి ఇచ్చాను. బదులుగా వుడా లేఅవుట్‌లో ఎకరానికి 18 సెంట్ల చొప్పున ప్లాట్‌లు ఇస్తామన్నారు. గత ప్రభుత్వంలో స్థలాలు కేటాయించారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో మాకివ్వాల్సిన ప్లాట్‌లను మంజూరు చేయకుండా తాత్సారం చేస్తున్నారు. మేమిచ్చిన భూముల్లో కాలనీలు నిర్మించి మాకు అన్యాయం చేస్తున్నారు. మాకు న్యాయం చేయకపోతే కాలనీ నిర్మాణ పనులను అడ్డుకుంటాం.

– తలారి మంగనాయుడు, ల్యాండ్ పూలింగ్ బాధితుడు, పాపయ్యపాలెం

ఎల్‌పీఎం ఇచ్చి చేతులు దులుపుకున్నారు



సర్వే నంబరు 179లో జీడిమామిడి చెట్లతో ఉన్న 80 సెంట్ల భూమిని ప్రభుత్వానికి ఇచ్చాను. బదులుగా కోడూరులో ఏడు సెంట్ల స్థలానికి ఎల్‌పీఎం ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారు. మాకిచ్చిన ఎల్‌పీ నంబర్ స్థలానికి రిజిస్ట్రేషన్ చేయకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. కూటమి నాయకులు మా ఆవేదన అర్థం చేసుకోవాలని కోరుతున్నాము.

– దుల్ల ఈశ్వరరావు, ల్యాండ్‌పూలింగ్ బాధితుడు. పాపయ్యపాలెం

స్థలం ఇవ్వకుండా తిప్పించుకుంటున్నారు



మా సాగులో ఉన్న 1.06 ఎకరాల భూమి తీసుకున్నారు. బదులుగా స్థలం ఇవ్వకుండా మమ్మల్ని కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారు. ప్రభుత్వం హామీ మేరకు మా స్థలాలు ఇవ్వాలి. లేకుంటే నిర్మాణాలను నిలిపివేసి మా భూములు మాకిచ్చేయాలని డిమాండ్ చేస్తున్నాం. అధికారులు మాకు న్యాయం చేయకపోతే పోరాటానికి సిద్ధమవుతాం.

– మట్టా నూకరత్నం, బాధితురాలు, పాపయ్యపాలెం

ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో ఫ్రీజర్లు బాగుచేయాలి

కొత్తగా మరో ఐదు ఏర్పాటు చేయాలని వినతి



ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఐక్యవేదిక నాయకులు

అనకాపల్లి: ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో ఫ్రీజర్లు మరమ్మతులకు గురవడం వల్ల మృతదేహాలు కుళ్లిపోయి దుర్వాసన వస్తున్నాయని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్ వాపోయారు. ఇక్కడ మూడు ఫ్రీజర్లలో ఒకటి మాత్రమే పనిచేస్తుందని, మిగిలిన రెండింటిని రిపేరు చేయించి, కొత్తగా ఐదు ఫ్రీజర్లు ఏర్పాటు చేయాలని స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావుకు ఆయన మంగళవారం వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత ఆస్పత్రికి రోగుల తాకిడి పెరిగిందన్నారు. రహదారి ప్రమాదాల్లో, ఇతర పరిస్థితుల్లో చనిపోయిన వారి బాడీలను భద్రపర్చడంలో వైద్యలయం సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. శిథిలావస్థకు చేరుకున్న మార్చురీకి కొత్త భవనం నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు కొల్లి చిన్నఅప్పారావు, కట్టమూరి మంగరాజు, ఆడారి బుచ్చిరాము, వాసుపల్లి తాతయ్యలు పాల్గొన్నారు.

తప్పుల సవరణ డీడీవోలకు ఇవ్వాలి

తుమ్మపాల: ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల కోసం తయారు చేసిన టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టంలో తప్పులను సరిదిద్దే అవకాశం డీడీవోలకు ఇవ్వాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోయిన చిన్నారావు, చెల్లా నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. సిస్టంలో తప్పులు కారణంగా ఉపాధ్యాయులు పాఠశాల నిర్వహణ వదులుకుని విశాఖ వెళ్లాల్సి వస్తుందని వాపోయారు.

ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ తరగతులు

ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం బోధనేతర సిబ్బందికి విభిన్న విభాగాలు, అంశాలపై విస్తృత అవగాహన కల్పించేలా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తానని వీసీ ఆచార్య రాజశేఖర్ అన్నారు. మంగళవారం అకడమిక్ సెనేట్ మందిరంలో వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, డిప్యూటీ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు, సూపరింటెండెంట్లు, ఇతర విభాగ అధిపతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీ ప్రతిష్టను పరిరక్షిస్తూ, మరింత పెంపొందించే దిశగా ప్రతి ఉద్యోగి పని చేయాలని సూచించారు. త్వరలో శతాబ్ది ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో మరింత వేగంతో పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. త్వరలో విభాగాల వారీగా ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం, సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఈఎస్ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వీసీకి అభినందనలు

ఏయూ వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య జీపీ రాజశేఖర్‌ను వర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్లు ఆచార్య బీలా సత్యనారాయణ, ఆచార్య జీఎస్ఎన్ రాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిష్టాత్మక ఏయూకు వీసీగా నియమితులవడం అభినందనీయమన్నారు.

వందేళ్ల ఉత్సవాల్లో భాగస్వాముల్ని చేయండి

ఆంధ్ర యూనివర్సిటీ వందేళ్ల ఉత్సవాల్లో తమను భాగస్వాముల్ని చేయాలని వర్సిటీలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు వీసీ రాజశేఖర్‌ను కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.సురేష్ మీనన్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శిరీష్, విక్రమ్, సురేంద్ర, దాస్, త్రినాథ్, పట్నాయక్, దంతేశ్వరి, సులోచన, జ్యోతి రమ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్

సమస్యలు పరిష్కరించాలి

ఆంధ్ర యూనివర్సిటీలో నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం వైస్ చాన్సలర్ ఆచార్య రాజశేఖర్‌ను కలిసి క్యాంపస్ కాలేజీలు, వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను వివరించారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్ రాకపోవడంతో నెలకు విద్యార్థుల నుంచి రూ.3,500లకు పైగా ఫీజును వసూలు చేస్తున్నారన్నారు. ఫీజు చెల్లించని సందర్భంలో విద్యార్థుల హాస్టల్ మెస్ కార్డులను నిలిపివేస్తున్నారని వీసీ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం వీసీకి వినతిపత్రం అందజేశారు.

పేకాట శిబిరంపై దాడి.. ఐదుగురిపై కేసు



పేకాట శిబిరంపై పోలీస్ దాడిలో పట్టుబడ్డ పేకాటరాయుళ్లు

పరవాడ: వెన్నలపాలెం గ్రామ సమీపంలో రహస్య ప్రదేశంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఎస్ఐ మహాలక్ష్మి తన సిబ్బందితో మంగళవారం రాత్రి దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.35 వేల నగదు, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై ఏపీ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు. ఎవరైనా చట్టవ్యతిరేక చర్యలు, జూదానికి పాల్పడితే తమకు సమాచారం అందించాలని కోరారు ఈ దాడిలో ఎస్‌తోపాటు సిబ్బంది కనకరెడ్డి, వల్లీ, మురళీ, మోహన్‌ప్రసాద్, రాము నాయుడు పాల్గొన్నారు.

పాల పోటీలను విజయవంతం చేయండి

కోటవురట్ల: విజయనగరంలో ఈ నెల 14 నుంచి జరగనున్న పాల పోటీలలో పాడి రైతులు పాల్గొనాలని డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ నరసింహులు కోరారు. మంగళవారం స్థానిక మండల పశు వైద్యశాలలో మాకవరపాలెం, కోటవురట్ల మండలాలకు చెందిన పశు వైద్యాధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలపోటీలకు ఎంపిక చేసిన హెచ్ఎఫ్, ముర్రా, జెర్సీ జాతులకు చెందిన పాడి పశువులను తగు జాగ్రత్తలతో తరలించాలని సూచించారు. రెండు మండలాలలో ఈ నెలాఖరు వరకు పశుగణన జరుగుతుందని, ఇప్పటి వరకు 96 శాతం నమోదు పూర్తయినట్టు తెలిపారు. ప్రతీ పాడి పశువుకు బీమా చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీ డాక్టరు పెట్ల నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిహారం ఇస్తేనే.. భూములు ఇస్తాం



ఆందోళన చేస్తున్న నాలుగు గ్రామాల రైతులు

- రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్వాసితుల ఆందోళన

పెందుర్తి: పెందుర్తి-నార్త్ సింహాచలం రైల్వే లైన్‌లో పార్లుపాలెం, చింతలగ్రహారం ప్రాంతంలో తలపెట్టిన రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తమకు పరిహారం ఇవ్వకుండా వంతెన నిర్మాణం కోసం, దశాబ్దాలుగా జీవనోపాధి పొందుతున్న తమ భూములను అధికారులు లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అవసరం కాబట్టి రైల్వే పై ఓవర్ వంతెన నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదన్నారు. అయితే వంతెన కోసం భూ సేకరణకు సిద్ధమైన అధికారులు, పరిహారం విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదన్నారు. భూములు ఇవ్వడానికి తాము సిద్ధమే అని.. అయితే పరిహారంపై ఉన్నతాధికారులు తమకు లిఖిత పూర్వక భరోసా ఇవ్వాలని స్పష్టం చేశారు.

తమ భూములు సింహాచలం దేవస్థానం పరిధిలో కూడా ఉండడం వలన దేవస్థానం అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, తమకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అనంతరం తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ ఆందోళనలో పార్లుపాలెం, చింతలగ్రహారం, చీమలాపల్లి, లక్ష్మీపురం ప్రాంతాల రైతులు పాల్గొన్నారు.

250 ఎకరాల భూముల ఆక్రమణపై ఫిర్యాదు



ఆర్డీవో కార్యాలయం వద్ద వైస్ ఎంపీపీ అప్పలరాజు

ఎస్.రాయవరం: మండలంలోని పెదఉప్పలం రెవెన్యూ పరిధిలో 250 ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయని ఫిర్యాదు చేస్తే మండల రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోలేదని వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పలరాజు వాపోయారు. దీనిపై నర్సీపట్నం ఆర్డీవో రమణకు మంగళవారం ఫిర్యాదు చేశానన్నారు. సర్వే నంబర్లు 428 ,489లో సబ్ డివిజన్ 10 వరకు, 495, 492, 499 ఇలా సుమారు 50 సర్వే నంబర్లకు సంబంధించి భూములు అన్యాక్రాంతమయ్యాయని, వీటిని సమగ్ర సర్వే నిర్వహించి భూ ఆక్రమణలు తొలగించాలని కోరారు. వీటిపై చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర స్థాయిలో ఉద్యమం చేస్తామన్నారు.

పిఠాపురానికి ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులు

- రూ.2.85 కోట్లతో అభివృద్ధి పనులకు ఒప్పందం

పరవాడ: కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో కమ్యూనిటీడెవలప్‌మెంట్ ప్రాజెక్టుల అభివృద్ధి కోసం సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం రూ.2.85 కోట్లు ఖర్చు చేసేందుకు సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు కాకినాడ జిల్లా కలెక్టర్‌తో సంస్థ ఒప్పందం చేసుకుంది. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సమీర్‌శర్మ, కాకినాడ చీఫ్ ప్లానింగ్ అధికారి మోహన్‌రావు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు ఈ ఒప్పందం జరిగింది. సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం మంజూరు చేయనున్న నిధులతో గొల్లప్రోలు మండలంలో సీసీ రోడ్లు, పాఠశాలలు, జూనియర్ కళాశాలలో సైన్స్ ల్యాబ్‌లు, సీహెచ్‌సీలో ఆక్సిజన్ ప్లాంట్, యు.కొత్తపల్లిలో కమ్యూనిటీ హాలు, పీహెచ్‌సీలో ఔట్ పేషెంట్ బ్లాక్ నిర్మాణాలతో పాటు పాఠశాలల్లో ఫర్నిచర్ సమకూర్చనున్నారు.



ఒప్పంద పత్రాన్ని ప్రదర్శిస్తున్న సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సమీర్‌శర్మ

పెట్టుగొల్లపల్లిలో ప్రకృతి సేద్యానికి ప్రణాళిక

ఎస్.రాయవరం: వచ్చే ఖరీఫ్ సీజన్‌కు పెట్టుగొల్లపల్లి గ్రామంలో వంద శాతం ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ప్రకృతి వ్యవసాయం డీపీఎం సీహెచ్ లక్ష్మన్న తెలిపారు. గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఇక్కడ సాగునీటి స్థితిగతులు పరిశీలించి ప్రకృతి సాగుకు సిద్ధమవుతున్నామన్నారు. ఇప్పటికే పలువురు రైతు లు ప్రకృతి వ్యవసాయం చేశారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సత్యనారాయణ వెలుగ ఏపీఎం శివప్రసాద్, ఏవో సౌజన్య, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది, స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.